RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 41 | ఫిబ్రవరి 27 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 41 | February 27 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గపు ప్రభుత్వం**

వెలుగుమట్ల బాధితులకు కేటీఆర్ భరోసా

2

## కుమ్మెర ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్

### నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ/నాగర్ కర్నూల్ జన సంఘర్షణ

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన కుల వివక్ష దాడి, పసికందు మృతి చెందడం మరియు ఈ విషయంలో పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (చీఽ=జ) తీవ్రంగా స్పందించింది. ఈ అమానుష ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నాలుగు వారాల్లోగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీలను ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదును స్వీకరించిన కమిషన్, ఈ మేరకు రాష్ట్ర అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా

➤ మిగతా 2వ పేజిలో..

## ఐఏఎస్‌ల బదిలీ

### 45 మంది అధికారులకు స్థానచలనం

హైదరాబాద్ జన సంఘర్షణ:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో కీలక మార్పులు చేస్తూ భారీ సంఖ్యలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45 మంది అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడంతో పాటు సచివాలయంలోని కీలక శాఖలకు కొత్త కార్యదర్శులను కేటాయించారు. ముఖ్యంగా రాహుల్ బొజ్జాను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్, విపత్తు నిర్వహణ మరియు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌లను నియమించారు. ఐటీ మరియు పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్. శ్రీధర్, ఆర్థిక శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్, ఎండోమెంట్స్ కమిషనర్‌గా ఎం. హనుమంతరావు

➤ మిగతా 2వ పేజిలో..

## సర్కారీ బడుల్లో కార్పొరేట్ వసతులు

### ప్రైవేట్ ఫీజులకు కళ్లెం వేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్ జన సంఘర్షణ :

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో విద్యాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారతీయ విద్యాభవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వంటి ప్రతిష్టాత్మక ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉండే మౌలిక సదుపాయాలను ప్రభుత్వ స్కూళ్లలోనూ కల్పించాలని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్‌లోని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే క్రమంలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఇందులో

➤ మిగతా 2వ పేజిలో..



## భారత్-ఇజ్రాయెల్ మధ్య సరికొత్త మైత్రి

### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు



జెరూసలేం/న్యూఢిల్లీ జన సంఘర్షణ :

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య అత్యంత కీలకమైన 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' త్వరలోనే కుదరనుందని ప్రధాని మోదీ అధికారికంగా ప్రకటించారు. ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేస్తూ, భారత్‌కు చెందిన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ 'యూపీఐ' సేవలను ఇజ్రాయెల్‌లోనూ అందుబాటులోకి తీసుకురావడానికి ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. సాంకేతికత, వ్యవసాయం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ వంటి మొత్తం 27 కీలక రంగాలలో పరస్పర సహకారానికి సంబంధించి 16 ఒప్పందాలపై ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంయుక్త సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, గాజాలో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని స్పష్టం చేశారు. ఏ సంఘర్షణలోనైనా మానవత్వం ఎప్పుడూ బలికాకూడదని, ప్రస్తుతం జరుగుతున్న శాంతి ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్

➤ మిగతా 2వ పేజిలో..

## మూడుముళ్ల బంధంతో ఒక్కటైన 'విరోష్'

ఉదయ్‌పూర్‌లో అంగరంగ వైభవంగా విజయ్-రష్మిక వివాహం




## మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

### ఏపీ కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం

అమరావతి జన సంఘర్షణ :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, మహా కుంభమేళా తరహాలో నిర్వహించాలని నిర్ణయించింది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్

➤ మిగతా 2వ పేజిలో..



## సర్కారీ బడుల్లో కార్పొరేట్ వసతులు

**మొదటిపేజీ తరువాయి..** భాగంగా విజయ డెయిరీ ద్వారా సేకరించిన పాలను తప్పనిసరిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల సౌకర్యార్థం ఒక్కో మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో రవాణా సహా అన్ని వసతులు కల్పించాలని, విద్యార్థుల ప్రయాణం కోసం ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేస్తూ సీఎం కఠిన హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రికవరీ చేసేలా కఠిన నిబంధనలు తీసుకురావాలని ఆదేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు వాటిని వెంటనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె. కేశవరావు, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సహా పలువురు ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయాల వీసీలు పాల్గొన్నారు.

## భారత్-ఇజ్రాయెల్ మధ్య సరికొత్త మైత్రి

**మొదటిపేజీ తరువాయి..** నెతన్యాహును త్వరలోనే భారత పర్యటనకు రావాలని మోదీ సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు వేనోళ్ల పొగిడారు. మోదీ ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని, భారత్ తమకు అత్యంత ఆప్తమిత్రుడని ఆయన కొనియాడారు. ఇదే సమావేశంలో ప్రధాని నెతన్యాహు ఒక ఆసక్తికరమైన వ్యక్తిగత విషయాన్ని పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ అద్భుతమైన భోజనం వల్లే తమ బంధం బలపడిందని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే సభలో నవ్వులు విరిశాయి. భారతీయ అపారమైన మేధస్సును, ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించడం ద్వారా ప్రపంచానికి మేలు చేసే అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

## మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

**మొదటిపేజీ తరువాయి..** సబ్ కమిటీ సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. 2027 జూన్ 26వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు నిర్వహించే ఈ వేడుకల కోసం రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రుల కమిటీ తీర్మానించింది. ఈ పుష్కరాలకు దాదాపు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భక్తుల సౌకర్యార్థం గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్యను పెంచుతూ, మొత్తం 4,516 మీటర్ల మేర 373 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరిలో 102, పశ్చిమ గోదావరిలో 40, కోనసీమలో 175, ఏలూరులో 36, కాకినాడలో 5 మరియు పోలవరం జిల్లాలో 11 ఘాట్లను ఏర్పాటు చేయనున్నారు. పోలవరం జిల్లాలోని గుండాల మొదటి ఘాట్‌గా, కోనసీమలోని అంతర్వేది చివరి ఘాట్‌గా ఉండనున్నాయి.

పుష్కరాల ప్రధాన రోజుల్లో కోటి మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న కమిటీ, పవిత్ర స్నానాల కోసం వచ్చే 2.25 కోట్ల మందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించింది. పిండ ప్రదాన ఘాట్లు, పారిశుధ్యం, రహదారులు, తాగునీరు వంటి కనీస వసతుల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేసింది. భక్తుల వసతి కోసం సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలను అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కమిటీ చర్చించింది. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక నోడల్ ఆఫీసర్లను నియమించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని జిల్లా కలెక్టర్లు రూపొందించిన ప్రణాళికలను సమీక్షించారు.

## ఐఏఎస్‌ల బదిలీ

**మొదటిపేజీ తరువాయి..** బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర నోడల్ అధికారి (ప్రజావాణి)గా డి. దివ్యను ప్రభుత్వం నియమించింది. జిల్లాల వారీగా చూస్తే, మహబూబాబాద్‌కు స్నేహ శబరీష్, రాజన్న సిరిసిల్లకు గరిమా అగర్వాల్, మెదక్‌కు ప్రతిమ సింగ్, భద్రాద్రి కొత్తగూడెంకు అనికేత్, హనుమకొండకు చాహత్ బజ్పాయి, మహబూబ్‌నగర్‌కు ఖుష్బూ గుప్తాలను కలెక్టర్లుగా నియమించారు. అలాగే యాదాద్రి భువనగిరికి అనురాగ్ జయంతి, కరీంనగర్‌కు చిత్రా మిశ్రా, జనగామకు సందీప్ కుమార్ ఝా, నారాయణపేటకు ప్రదీప్ జైన్ కొత్త కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ముష్రఫ్ అలీ ఫారూఖీని టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియమించగా, జితేష్ వి. పాటిల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మరికొందరు అధికారులను ప్రాధాన్యత కలిగిన శాఖలకు బదిలీ చేశారు; ఇందులో విజయేంద్రను సోషల్ వెల్ఫేర్ సెక్రటరీగా, పమేలా సత్పతిని లేబర్ కమిషనర్‌గా నియమించారు. అద్వైత్ కుమార్ సింగ్‌ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ సమన్వయకర్తగా పంపగా, సిక్తా పట్నాయక్ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు. పాలనలో వేగం పెంచేందుకే ఈ భారీ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## కుమ్మెర ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్

**మొదటిపేజీ తరువాయి..** చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబానికి ఆలయ ప్రవేశాన్ని నిరాకరించడమే కాకుండా, రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. బాధితులు న్యాయం కోసం నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పటికీ, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అధికారులు నిరాకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసుల ఈ తీరు రాజ్యాంగ రక్షణలను మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని కమిషన్ ప్రాథమికంగా గుర్తించింది. నిందితులను వెంటనే అరెస్టు చేయడంతో పాటు, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. బాధితులకు తగిన రక్షణ కల్పించి, పరిహారం అందజేయాలని సూచించింది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ జోక్యం ఏమాత్రం ఉండకూడదని, బాధితులకు అండగా నిలవడంలో కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అని న్యాయవాది వినోద్ హిందుస్థానీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గపు ప్రభుత్వం: వెలుగుమట్ల బాధితులకు కేటీఆర్ భరోసా

ఖమ్మం: తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలో ఒక దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల కూల్చివేతలను గురువారం ఆయన పరిశీలించారు. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులను పరామర్శించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, నిరుపేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత అమానుషమని ఆక్షేపించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల కన్ను ఇక్కడి 60 ఎకరాల భూమిపై పడిందని, వారి స్వార్థ ప్రయోజనాల కోసమే 900 పేద కుటుంబాలను నిరాశ్రయులను చేశారని మండిపడ్డారు. ఈ అన్యాయంపై వచ్చే నెల 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై నిలదీస్తామని, బాధితుల పక్షాన గట్టిగా పోరాడుతామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, న్యాయపోరాటం కోసం అయ్యే ప్రతి పైసా ఖర్చును పార్టీయే భరిస్తుందని, లీగల్ టీమ్ ద్వారా కోర్టుల్లో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వంలోని మంత్రులు బాధితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తారని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఆశ చూపి ఐక్యతను దెబ్బతీసే కుట్రలు చేస్తారని కేటీఆర్ హెచ్చరించారు. బాధితులంతా సంఘటితంగా ఉంటేనే విజయం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. అధికారులు తప్పు చేయకపోతే ఆర్డీవోను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించిన ఆయన, మంత్రులకు ధైర్యముంటే ఇక్కడికి వచ్చి బాధితులతో మాట్లాడాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ అన్యాయం జరగలేదని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే ప్రాంతంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామని మాటిచ్చారు. స్థానిక నేతలు అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఎప్పుడూ బాధితులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. పేదల కన్నీళ్లు వృథా పోవని, న్యాయపరంగా పట్టాలు ఇప్పించే వరకు తమ పోరాటం ఆగదని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

## కెసిఆర్ వల్లనే తెలంగాణ అప్పులపాలు: వివేక్

**హైదరాబాద్, ఫిబ్రవరి26 :** కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పుల పాలైందని.. కమిషన్ల కోసమే ఆయన ప్రాజెక్టులు కట్టారని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. రూ.లక్షా 75 వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేశారని.. కానీ నాలుగేండ్లకే ఆ ప్రాజెక్ట్ కుప్పకూలిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ ఆస్తులు, సొంత ఆస్తులు పెంచుకుందని అన్నారు. ప్రపంచంలోనే ధనిక రీజనల్ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ చేసేందుకు కేసు సీబీఐకి అప్పగించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల డిజైన్ మార్చారని అన్నారు.

## పల్టీలు కొట్టు రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు

**జనగామ, ఫిబ్రవరి26 :** జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ లో స్విఫ్ట్ కారు పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా చిల్పూరు మండలం దేశాయి తాండా దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ నుంచి దేశాయి తండాకు స్విఫ్ట్ కారు వెళ్తుండగా పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. డ్రైవర్ గల్లంతైనట్లు తెలుస్తోంది. గాయాలతో బయటపడ్డ దారావత్ చరణ్ ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్న భూక్యా పవన్ ఆచూకీ దొరకలేదని తెలిపారు పోలీసులు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు గల్లంతైన భూక్యా పవన్ కోసం గాలింపు చేపట్టారు.

## మూడుముళ్ల బంధంతో ఒక్కటైన ‘విరోష్’

**ఉదయ్‌పూర్‌లో అంగరంగ**

**వైభవంగా విజయ్-రష్మిక వివాహం**

**ఉదయ్‌పూర్/హైదరాబాద్:** టాలీవుడ్ మోస్ట్ సెలబ్రేటెడ్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న ఐటీసీ మిమెంటోస్ రిసార్ట్ వేదికగా గురువారం ఉదయం 10.10 గంటలకు వేదమంత్రాల సాక్షిగా ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో విజయ్ దేవరకొండ రష్మిక మెడలో మూడు ముళ్లు వేశారు. తొలుత తెలుగు సంప్రదాయం ప్రకారం వివాహ క్రతువు నిర్వహించగా, సాయంత్రం రష్మిక మూలాలకు గౌరవమిస్తూ కొడవ (కూర్గి) పద్ధతిలో మరోసారి వేడుక నిర్వహించారు. పెళ్లి అనంతరం రష్మిక తన సోషల్ మీడియా ఖాతాలో వివాహ చిత్రాలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. “హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా.. మిస్టర్ విజయ్ దేవరకొండ” అంటూ తన సంతోషాన్ని అభిమానులతో పంచుకున్నారు. తనకు నిజమైన ప్రేమ అంటే ఏమిటో నేర్పించిన వ్యక్తి విజయ్ అని, అతని భార్యగా పిలిపించుకోవడం గర్వంగా ఉందని రష్మిక పేర్కొన్నారు.

విజయ్ దేవరకొండ కూడా తన మనసులోని మాటను పంచుకుంటూ.. “ఒకరోజు ఆమెను చాలా మిస్ అయ్యాను. నా పక్కన తనుంటే నా రోజు ఇంకా బాగుండేదని, తను ఎదురుగా ఉంటే నా భోజనం ఇంకా రుచిగా ఉంటుందని అనిపించింది. అందుకే నా బెస్ట్ ఫ్రెండ్‌ను నా భార్యగా చేసుకున్నాను” అని పోస్ట్ చేశారు. ‘విరోష్’ (ఎ×=చూాఎ) పేరుతో అభిమానులు పిలుచుకునే ఈ జంట తమ వివాహానికి కూడా అదే పేరును ఖరారు చేయడం విశేషం. ఈ వేడుకలో భాగంగా ‘విరోష్ ప్రీమియర్ లీగ్’ పేరిట క్రికెట్ మ్యాచ్, పూల్ వాలీబాల్ వంటి వినూత్న కార్యక్రమాలతో అతిథులను అలరించారు. పెళ్లికి హాజరైన అతిథుల సంఖ్య పరిమితంగా ఉన్నప్పటికీ, సినిమా పరిశ్రమకు చెందిన ప్రముఖుల కోసం మార్చి 4న హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలతో వెండితెరపై అలరించిన ఈ జంట.. ఇప్పుడు నిజ జీవితంలోనూ ఒక్కటి కావడంతో అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## కలెక్టర్ బదిలీలో పండగ చేసుకున్న జనం

**మానుకోటలో బాణాసంచా కాల్చి...స్వీట్లు పంపిణీ**

**మహబూబాబాద్, ఫిబ్రవరి26 :** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేయడంతో మానుకోట జిల్లాలో పండగ వాతావరణం నెలకొంది. గత కొంతకాలంగా కలెక్టర్ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న గిరిజన ప్రజా సంఘాలు, ఈ బదిలీ వార్త తెలియగానే రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

గత రెండు సంవత్సరాలుగా కలెక్టర్‌గా పనిచేసిన అద్వైత్ కుమార్, జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గిరిజన నాయకులు ఆరోపించారు. ఒక గిరిజన జిల్లాగా ఉన్న మహబూబాబాద్‌ను ఆయన తన నిర్ణయాలతో పదేళ్ల పాటు వెనక్కి నెట్టేశారని వారు విమర్శించారు. రైతుల భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాల జాప్యం వంటి కీలక అంశాలను ఆయన గాలికి వదిలేశారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్‌కు వచ్చే ప్రత్యేక నిధులను పేద వర్గాల ప్రజల సంక్షేమం కోసం లేదా అభివృద్ధి పనుల కోసం వినియోగించలేదని బాధితులు పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపించేశారని, ఇది జిల్లా ప్రజలకు చేసిన ద్రోహమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా , వైద్య రంగాల్లో నెలకొన్న కనీస సమస్యలను కూడా ఆయన పరిష్కరించలేకపోయారని ధ్వజమెత్తారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం మంత్రులు ఇచ్చిన ఆదేశాలను కూడా కలెక్టర్ లెక్కచేయలేదని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గిరిజన సంఘాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఆయనను బదిలీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గిరిజన జిల్లా ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సమస్యలను అర్థం చేసుకునే కొత్త కలెక్టర్ రావాలని వారు కోరుకుంటున్నారు.

# ఆపదలో ఆపన్నహస్తం..

- కోమటిరెడ్డి వెంకటరెడ్డి మానవతా హృదయం మరోసారి వెలుగులోకి..!



నల్లగొండ . ఫిబ్రవరి 26 . (జన సంఘర్షణ )
నల్గొండ 30వ డివిజన్‌కు చెందిన షేక్ జహంగీర్ అనే యువకుడుకి విజయవంతమైన హార్ట్ ఆపరేషన్ చేయించిన మంత్రి. గత కొన్ని రోజుల క్రితం జహంగీర్ అనే యువకుడు గుండె సంబంధిత వ్యాధితో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స. ఆపరేషన్ ఖర్చు రూ. 8.5 లక్షలు అని వైద్యులు తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా రూ. 3 లక్షలు మంజూరు కాగా. మిగిలిన రూ. 5.5 లక్షలు బకాయి చెల్లింపు చేయాల్సి ఉండే. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న నిరుపేద జహంగీర్ కుటుంబం 30 వ వార్డు డివిజన్ కార్పొరేటర్ నవీన్ గౌడ్ కు విషయాన్ని తెలియజేశారు కుటుంబ సభ్యులు. ఈ విషయాన్ని కార్పొరేటర్ నవీన్ గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. వెంటనే స్పందించి మంత్రి స్వయంగా ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి రూ. 4 లక్షలు తగ్గింపు చేయించారు. అదనంగా రూ. 1.5 లక్షలు స్వయంగా చెల్లించి సహాయం అందజేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేద కుటుంబానికి అండగా నిలబడటంతో షేక్ జహంగీర్ కుటుంబ సభ్యులు, నల్గొండ ప్రజలు మంత్రికు కృతజ్ఞతలు తెలిపారు..

# జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లాకు పతకాల పంట..

- రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తా చాటిన కామారెడ్డి జిల్లా క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్ లో భాగంగా గోల్డ్ మెడల్స్ 7, సిల్వర్ మెడల్ 8, కాంస్య పతకాలు 7. బాల్ బ్యాట్మెంట్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానంతో పాటు లక్షరూపాయలు నగదు
- బాలురు అండర్ 20 రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం 75 వేల రూపాయల నగదు
- సెపక్ థాక్రా మహిళల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి, 75 వేల రూపాయల నగదు
- హాకీ అండర్ 19 లో బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి తో పాటు 50 వేల రూపాయల నగదు
- నెట్ బాల్ అండర్ 19 లో బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి 50 వేల రూపాయల నగదు బహుమతి పొందిన జిల్లా క్రీడాకారులు



కామారెడ్డి: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)
జిల్లా స్థాయి పోటీలకు, నిర్వహణకు భోజన వసతులకు సంబంధించి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ డీఎంఎఫ్‌టీ ఫండ్ కింద 2 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ పథకాలు సాధించిన క్రీడాకారులు ఆర్థిక సహాయంగా ముగ్గురు పరుశురాం, ఆనంద్, ఈశ్వర్ లకు ఒక్కొక్కరికి 25 వేల రూపాయల చొప్పున 75 వేల రూపాయలు గత డిసెంబర్ లో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవచూపి జిల్లాకు పతకాల సాధించే విధంగా కృషి చేశారు. జిల్లాకు ఇన్ని పథకాలు సాధించిన సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ప్రతీ సారి పథకాలు సాధిస్తూ క్రీడా హబ్ గా మార్చడానికి అన్ని క్రీడాసంఘాలు కృషి చేయాలని కోరారు. లాంగ్ జంప్ జావలింగ్ త్రో బంగారు పతకం పరుశురాం , 800 మీటర్స్ ఈశ్వర్ సిల్వర్, లాంగ్ జంప్ శ్రీనిధి వెండి పథకం, జావలింగ్ త్రో ఈశ్వర్ ప్రసాద్, కాంస్య పతకం, అమృత, కాంస్య పతకం, బాక్సింగ్ స్వేటిజ 48 కేజీల విభాగం లో బంగారు పతకం, రోయింగ్ అండర్ 14 బాలికలు డబుల్స్ లో బంగారు, సింగ్ లో వెండి పథకం విద్యా సాయి సాధించారు. యోగాలో సహస్ర, సింధు జా, సునీత బంగారు పతకాలు, సిల్వర్ కవిత, శిరీష, కుస్తీ పోటీలలో ప్రభాస్, భాస్కర్ సిల్వర్, జ్యోతి, అనిల్, ప్రవీణ్ కాంస్య పతకాలు, కరాటేలో వంశీ సిల్వర్, రోహిత్ కాంస్య పతకం, క్యారమ్ డబుల్స్ లో ప్రణయ్, రాజు కాంస్య పతకం లు సాధించి జిల్లాకు రోల్డ్ మోడల్ గా నిలిచారని కలెక్టర్ అభినందించారు. పైన తెలిపిన వ్యక్తిగత క్రీడలలో బంగారు పథకానికి 20 వేల రూపాయలు, వెండి పథకానికి 15 వేల రూపాయలు, కాంస్య పతకం నకు 10 వేల రూపాయలు మొత్తంగా 6 లక్షల 89 వేల రూపాయలు, ట్రోఫీ తో పాటు నగదుగా పొందడం జరిగింది .ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ విక్టర్, డీవైఎస్ఓ రంగ వెంకటేశ్వర గౌడ్, డీఐఈఓ సలాం, అన్ని క్రీడా సంఘాల అధ్యక్షకార్యదర్శులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో పర్యటించిన ప్రభుత్వ ముఖ్య సలహాదారులు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ప్రభుత్వ పెద్దలు
- ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంత పరిశీలన



బోధన్: ఫిబ్రవరి 26 జన సంఘర్షణ
ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా చొరవతో ప్రభుత్వ ముఖ్య సలహాదారు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోదాం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా తదితరులు భోరజ్ మండలంలోని కొర్టా చనాకా ప్రాజెక్ట్ సమీపంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతాన్ని సందర్శించారు. ముందుగా హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించి ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాలు, ప్రభుత్వ భూములు, సాగుభూములు, సాగుకు అనర్హ భూముల వివరాలను పరిశీలించారు. ముఖ్యంగా పెంగంగ నది సమీప ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలు మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో 10,000 ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించామని, ఇప్పటికే 6,000 ఎకరాలను గుర్తించామని తెలిపారు. నీరు, విద్యుత్, జాతీయ రహదారి, రైల్వే, ప్రతిపాదిత విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, రైతుల భూముల విలువ పెరగడం, జిల్లా ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎస్పీ, ఏసీ రెవెన్యూ, ఏసీ లోకల్ బాడీస్ సహా ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అమ్మాయిలను వేధించే ఆకతాయికి రెండు రోజుల జైలు శిక్ష




బోధన్: ఫిబ్రవరి 25 జన సంఘర్షణ
బోధన్ పట్టణంలో జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో ఒక ఆకతాయి యువకుడిని షీ టీం పోలీసులు అదుపులోకి, బోధన్ ఎస్‌హెచ్ఓ ముందు హాజరు పరచగా, అతని పై కేసు నమోదు చేసి స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ముందు హాజరు పరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించారు. బోధన్ పట్టణంలో షీ టీం, స్థానిక పోలీసులు ఆడ పిల్లల ను వేధించె ఆకతాయిలను గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై కుల,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో : మోటకొండూర్

యాదాద్రిభువనగిరి జిల్లా/మోటకొండూర్/ఫిబ్రవరి 26(జనసంఘర్షణ ప్రతినిధి):



నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో ప్రాణాలు కోల్పోయిన రెండు నెలల చిన్నారి మృతి పట్ల మోటకొండూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీకులసంఘాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. తక్కువ జాతి కులస్తులపై అగ్రవర్ణ కులాలు చూపుతున్న అహంకారంపై నిరసన తెలియజేస్తూ చిన్నారి మృతికి కారణమైన నిందితుల్ని వెంటనే అరెస్టు చేసి శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నారి మృతికి కారణమైన శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకొని దోషులను అరెస్టు చేసి శిక్షపడేలా చేయాలని నినాదాలు చేశారు.

# సారాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

గాంధారి: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)




గాంధారి మండలం రామలక్ష్మణ పల్లి గ్రామంలో లాకావత్ రాము అనే వ్యక్తి తన ఇంటి వద్ద అక్రమంగా సారాయి తయారుచేసి, అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మూడవ తేదీన అతని ఇంట్లో సోధా చేయగా, అతని ఇంట్లో కూలర్ లో దాచి ఉంచిన నాలుగు లీటర్ల సారాయిని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేయడమైనది. ఇట్టి కేసులో నిందితుడు అయిన లాకావత్ రామును గురువారం అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్ కి పంపనైనదని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సారాయి పూర్తిగా అరికట్టడంలో గతంలో ఉన్న అధికారులు చాలా కష్టపడడం జరిగినది. ప్రతి సారాయి అమ్మకము తయారు చేయడం అనేది ప్రభుత్వం పూర్తిగా నిషేధించబడినది. సారాయి వల్ల ప్రజల ఆరోగ్యం చెడు పోతున్నది కావున సారాయి తయారుచేసిన, అమ్మిన జైలు శిక్ష తప్పదన్నారు.

# కుల వివక్షతో దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

లింగంపేట్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ )



కుల వివక్షతో దాడి చేసి రెండు నెలల పసిపాప మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని గురువారం విలేకరుల సమావేశంలో మండల రజక సంఘం అధ్యక్షుడు ఆశన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కొరే గ్రామంలో ఇటీవల జరిగిన మల్లన్న జాతర సందర్భంగా ఆలయంలోకి రజకులు టికెట్ లేకుండా ప్రవేశించారని నెపంతో అక్కడి అగ్రవర్ణ కులానికి చెందిన వారు దాడి చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఈ దాడిలో రెండు నెలల పసిపాప మృతికి కారకులైన శ్రీనివాస్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన సమయంలో అక్కడే ఉండి చోద్యం చూస్తున్న సర్పంచ్ తుకారాంరెడ్డిని పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. వీరిద్దరితోపాటు శ్రీకాంత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కన్నా రెడ్డి, సతీష్ రెడ్డి, మాధవరెడ్డి లను సైతం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్య అగ్రవర్ణాల దౌర్జన్యానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు చర్య తీసుకొని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.పాప కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకుడు కాశీరాం, మండల సమన్వయకర్త సాయిరాం తదితరులు ఉన్నారు.

# హైకోర్టులో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల పై విచారణ...

- 30 ఏప్రిల్ 2026 వరకు గడువు పొడిగింపు..

హైదరాబాద్ సిటీ బ్యూరో ఫిబ్రవరి 26 ( జనసంఘర్షణ )
జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులకు సంబంధించిన జీవో నంబర్ 252 జీవో 103 సవరణలపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టియుడబ్ల్యుజేఎఫ్ దాఖలు చేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అక్రిడేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడగించనున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ అక్రిడేషన్ కార్డుల నిబంధన మార్పులపై తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలని ఆదేశించింది.

## "తెలంగాణ తిరుమల దేవస్థానం" శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు...





బీర్కూరు: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)

దేవనాధ రామానుజ జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవములో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి పుష్ప దంపతులు. పాల్గొన్న పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి ప్రేమల దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి సోని రెడ్డి దంపతులు, పోచారం సురేందర్ రెడ్డి ,ఆలయ కమిటీ సభ్యులు. స్వామి వారి కళ్యాణానికి ముందుగా జరిగిన హోమం లో సతీసమేతంగా పూజలు నిర్వహించిన పోచారం అనంతరం మాడవీధుల్లో హనుమద్వాహనం పై స్వామి వారిని ఊరేగించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, భారీ ఎత్తున భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

## అధికార అహంకారంతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై హత్యాయత్నం




26-2-2026జన సంఘర్షణ

భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలు ముగిసి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ గెలిచాము అనే అధికారం తో 22వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ కుంటుంబానికి సంబంధించిన అన్నదమ్ములు నార్లపాటి నవీన్, నార్లపాటి సురేష్, నార్లపాటి వినోద్ అను వ్యక్తులు పేరాయిగూడెం గ్రామానికి చెందిన ప్రదీప్ అనే యువకుడిపై బుధవారం సాయంత్రం సమయంలో మోడల్ కాలనీ శివారు లో ఉన్న నర్సరీకి వెళ్తున్నా నార్లపాటి ప్రదీప్ ను కాపు కాచి విచక్షణా రహితంగా కొట్టి, తలపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ప్రదీప్ కుడి కన్ను కి గాయం అయ్యి కన్ను తెరిచే పరిస్తితి లేదు, ఎంత అరుస్తున్న ఆలోచించకుండా కింద పడేసి ప్రదీప్ బీర్జాలపై తన్ని అధికారం లో మా పార్టీ ఉంది నిన్ను చంపినా అడిగే దిక్కు లేదు, నువ్వు మాకు వ్యతిరేకంగా తిరుగుతావ అని ఎద్దేవచేస్తూ, ప్రదీప్ పై దాడికి పాల్పడ్డారు. కర్రలతో తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సంఘటనా స్థలంలో ఉన్న ప్రదీప్ విషయం తెల్సుకున్న బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకొని ప్రదీప్ ను అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రదీప్‌ను మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పోల్కంపేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక..

లింగంపేట్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)

లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారా గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు గ్రామంలో పార్టీ సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాసుల కృష్ణమూర్తి ఉపాధ్యాక్షుడిగా రాజమౌళి, ప్రధాన కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సూరంపల్లి యాదగిరి, కోశాధికారిగా తలారి యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా దేవసోత్ బద్రు, కీసరి రాములు, సంగం రాజమణి, చింతకుంట గంగయ్య, దుర్గాపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వంశీ కుమార్ ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సక్రు నాయక్, అయ్యపల్లి గ్రామ సర్పంచ్ గోనె లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఫీయొద్దీన్, ఎల్లమయ్య, నగేష్ ,సాయి కుమార్, శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బీబీపేట లో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి 8 వ వార్షిక పూజలు..




బిబిపేట: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)

ఈరోజు బిబిపేట శ్రీహరి పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 8వ వార్షికోత్సవ పూజల సందర్భంగా ఉదయం గణపతి హోమం తదుపరి అష్టాభిషేకం, కలిసాభిషేకం జరిగింది. అయ్యప్ప స్వామి మాలాదారులు దంపతుల సమేతంగ వచ్చారు. తదుపరి తీర్థప్రసాదాలు పంచామృతం, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు, ఇట్టి కార్యక్రమంలో మనోజ్ పాండే పంతులు, గురు స్వామి చంద్రశేఖర్, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు చందుపట్ల విట్టల్, కార్యదర్శి బాశెట్టి నాగేశ్వర్, అరికెలా నందకుమార్, లింగాల రాజా గౌడ్, వడ్ల వెంకటేశం, తోడుపునూరు సాయి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధంపై శ్రద్ధ వహించాలి..

❏ ఎంపీ ఓ ప్రభాకర్ చారి..



ఎల్లారెడ్డి. ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)

గ్రామపంచాయతీ నూతన పాలకవర్గాలు పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ ప్రభాకర్ చారి సూచించారు. గురువారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సాధ్యమైనంత తొందరలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి కొరకు ప్రణాళికాలు రూపొందించుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైతే తమ సహాయం తీసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ అంజయ్య తదితరులు ఉన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

బోధన్ : ఫిబ్రవరి 26 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా, విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఏ.ఎన్.ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

## మాజీ మేయర్ అమర్ సింగ్‌కు తుంగతుర్తి రవి శుభాకాంక్షలు

❏ ఘనంగా సన్మానించి నోటు పుస్తకాలు బహుమతిగా ఇచ్చిన తుంగతుర్తి రవి

హైదరాబాద్ సిటిబ్యూరో ఫిబ్రవరి 26 ( జనసంఘర్షణ )




పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ జన్మదిన వేడుకలు మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ బుద్ధ నగర్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అమర్ సింగును ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉండి, భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని తుంగతుర్తి రవి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణి కి రంగం సిద్ధం

రాజంపేట : ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)



రాజంపేట మండల కేంద్రంలోని బోరుగడ్డ ప్రాంతం లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణి కి రంగం సిద్ధం అయినట్లు తెలిసింది. గత వారం రోజుల క్రితం లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయినట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. అయితే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణి రెండు మూడు రోజులలో లబ్ధిదారులకు అందచేయనున్నట్లు తెలిసింది.

## ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం..

ఎల్లారెడ్డి. ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ పరీక్షల కోసం మోడల్ డిగ్రీస్ కళాశాల, జూనియర్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. మోడల్ డిగ్రీ కళాశాల సెంటర్లో 184 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఇద్దరు గైరాజరయ్యారని పరీక్ష నిర్వాహకులు తెలిపారు. అలాగే జూనియర్ కళాశాల సెంటర్లో 201 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఒక్కరు గైరాజరయ్యారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్ష సి ఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఎంత పరీక్ష అట్టలు హాల్ టికెట్ మాత్రమే తీసుకురావాలని చెప్పారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు కానీ, సెల్ ఫోన్ వెంట తీసుకురావద్దని వాటిని అనుమతించమన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫౌండ్ చెక్కుల పంపిణి

రాజంపేట : ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)




రాజంపేట మండలం లోని ఎల్లారెడ్డి పల్లి తండా గ్రామంలో గురువారం కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫౌండ్ చెక్కుల పంపిణి చేసినట్లు గ్రామ సర్పంచ్ లలిత బన్సిలాల్ తెలిపారు. పేదోడి కలలను నిజం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, అలాగే బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సహకారంతో గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ పిర్యా, తండా పెద్దలు బన్సీ, పెంట్య, సంతోష్, సూర్య, రమేష్, బాబా, నరేష్, తదితరులు ఉన్నారు.

## రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలి..

హైదరాబాద్ సిటిబ్యూరో / ఫిబ్రవరి 26( జనసంఘర్షణ )



రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం లోని డివిజన్లో తెలంగాణ ఉద్యమకారులకు పోటీ చేసే అవకాశం కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులు ఆ పార్టీ యువ నాయకుడు ముఠా జయసింహను కలిసి వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా పార్టీ పదవుల్లో సైతం తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా ముఠా జై సింహ మాట్లాడు తూ ఉద్యమకారులకు ఎన్నికల్లో అవకాశం కల్పించే విధంగా అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమ కారులు కల్వ గోపి, రేషం మల్లేష్, అజయ్ ముదిరాజ్, సిరిగిరి శ్యామ్ నేత శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, బిక్షపతి, జోగేందర్, వేణుయాదవ్, బాలరాజ్, దేవయ్య, చంద్రశేఖర్ యాదవ్, వంశీ చింతకింది, మందుల నరసయ్య, విట్టల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్రూర్‌లో దొరికిన మొబైల్ ఫోన్ పోలీస్ స్టేషన్లో అప్పగింత ఎస్సై సాయన్న

రుద్రూర్: ఫిబ్రవరి.26( జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం దొరికిన మొబైల్ ఫోన్ను పోలీసులకు అప్పగించి రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ నిజాయతీని చాటుకున్నారు. బుధవారం రాత్రి రాణంపల్లి సమీపంలో ఆయనకు ఒక మొబైల్ దొరకగా, గురువారం దానిని పోలీస్ స్టేషన్లో ఎస్సై సాయన్నకు అందజేశారు. హరికృష్ణ సామాజిక బాధ్యతను గుర్తించిన ఎస్సై సాయన్న, సిబ్బంది ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

## ఖమ్మంలో కేటీఆర్ తో దిండిగాల భేటి

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. ఫిబ్రవరి 26 ( జన సంఘర్షణ)



భూదాన్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లాకు విచ్చేసిన కేటీఆర్ ని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దిండిడిగాల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భూదాన్ భూముల సమస్యలతో పాటు పేద వర్గాల ఇళ్ల కూల్చివేతల అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల పేద ప్రజలు సంవత్సరాలుగా నివసిస్తున్న ఇళ్లను అకస్మాత్తుగా కూల్చివేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు నోటీసులు లేకుండా, ప్రత్యామ్నాయ నివాసం కల్పించ కుండా ఇళ్లను ధ్వంసం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. దిండిడిగాల రాజేందర్ మాట్లాడుతూ... భూదాన్ భూములు కేటాయించిన పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. భూమి హక్కులు ఇవ్వకుండా, ఇళ్లు కూల్చడం ద్వారా పేదల జీవనాధారాన్ని దెబ్బతీయడం సరికాదని విమర్శించారు. ఈ విషయంపై కేటీఆర్ స్పందిస్తూ, బాధితుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి చట్టపరమైన మార్గాల్లో న్యాయం జరిగేలా పార్టీ తరఫున పోరాటం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. పేదల పక్షాన బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయ కులు, కార్యకర్తలు పాల్గొని బాధితులకు పూర్తి మద్దతు ప్రకటించారు.

## రుద్రూర్ మండలం పోలీస్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యత

రుద్రూర్: ఫిబ్రవరి.26( జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం రుద్రూర్ బస్టాండు వద్ద డిసిక్రవాహనాలు కారు ప్రయాణం లో స్పీడ్ బెల్ట్ రుద్రూర్ ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిని గుర్తించి, వారికి రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి వ్యక్తి తన ప్రాణాలను తానే కాపాడుకునే ముఖ్యమైన భద్రతా చర్య అని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనదారునికి తప్పనిసరిగా ప్రమాణిత హెల్మెట్ ధరించాలని సూచించారు. వేగ నియంత్రణ పాటించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన అన్నారు. పిల్లలు, యువత రోడ్లపై ప్రయాణించే సమయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు భద్రతా అలవాట్లు అలవర్చాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చివరగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ తమ కుటుం బాలకు సురక్షితంగా చేరాలని ఎస్ఐ సునిల్ ద్విచక్ర వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

## ఉపాధిహామీ పనులలో నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో నరేష్..

లింగంపేట్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)




లింగంపేట్ మండలంలోని కోర్పోల్ గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులలో భాగంగా నర్సరీలను, అంగన్వాడీ కేంద్రాన్ని,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. నర్సరీలలో మొక్కల నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం తొందరగా పూర్తి చేయాలన్నారు. దశలవారీగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం చేయాలన్నారు. బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదుచేయాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణీలకు, బాలింతలకు,చిన్నారులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్మరి ఏగోండా పంచాయతీ కార్యదర్శి రవికాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ కాళిదాస్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఇందిరమ్మ లబ్ధిదారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూల్, అంగన్వాడీలు తనిఖీ చేసిన బోధన్ సబ్ కలెక్టర్

బోధన్ ఫిబ్రవరి 26 జన సంఘర్షణ



బోధన్ మండలంలోని సాలంపాడులోని అంగన్‌వాడీ టీచర్‌తో ప్రీ-స్కూల్ విద్యా కలాపాల నిర్వహణ, అనుబంధ పోషకాహారాన్ని అందించడం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, ఆరోగ్యం బోధన్ సబ్-కలెక్టర్ అకస్మితంగా తనిఖీ నిర్వహించారు. హాజరు రికార్డుల నిర్వహణ, ఆరోగ్య సిబ్బందితో సమన్వయం, పిల్లల సంరక్షణ, తల్లి ఆరోగ్యానికి సంబంధించిన సమాజ అవగాహన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతి, డి,ఎస్పీ, ఈ పెండింగ్ ఫైళ్ల స్థితి మరియు ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న ఫారలు 6, 7,8 క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారం గురించి బి,ఎల్,ఓ తో మరింత సమీక్షించారు. నిర్వాహకులు మాత్రమే సందేశాలను పంపాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి, టీచర్లు ,సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజ వికాసం

హైదరాబాద్ బ్యూరో/ ఫిబ్రవరి 26 ( జనసంఘర్షణ )



తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టిఆర్‌విఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ మున్నా మాట్లాడుతూ..దివ్యాంగులకు సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం కల్పించినప్పుడే నిజమైన సమాజ వికాసం సాధ్యమవుతుంది. దివ్యాంగుల జీవితాలు ఇప్పటికీ అనేక అడ్డంకులు, వివక్షలు, అవమానాలతో నిండిపోయి ఉన్నాయనియి. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు, ప్రభుత్వ కార్యాలయాల నుండి న్యాయస్థానాల వరకు అనేక చోట్ల అనుమానంతో, తక్కువ చూపుతో వ్యవహరించడం ఒక వ్యవస్థాగత వివక్షగా మారింది.

**చట్టం ఉన్నా అమలులో లోపాలు :**

2016లో అమలులోకి వచ్చిన రైట్ ఆఫ్ పర్సన్ విత్ డిసాబిలిటీ యాక్ట్ 2016 ప్రకారం దివ్యాంగులను దయార్హులుగా కాకుండా సమాన హక్కులు కలిగిన పౌరులుగా గుర్తించిన ప్పటికీ, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అమలులో స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నాయి. దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం, ఫైళ్లను పక్కన పెట్టడం, పదేపదే కార్యాలయాలకు తిరగమంటూ మానసిక వేధింపులకు గురిచేయడం చట్టవిరుద్ధం. ఉద్యోగాల్లో ప్రమోషన్లు, బదిలీలలో వివక్ష చూపడం కూడా చట్టానికి వ్యతిరేకం.

**ఆస్తుల రక్షణలో ఆందోళనకర పరిస్థితి :**

దివ్యాంగుల భూములను అక్రమంగా ఆక్రమించడం, బెదిరింపులు చేయడం, రాజీకి ఒత్తిడి చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఇటువంటి కేసుల్లో వెంటనే పోలీసు ఫిర్యాదులు నమోదు చేసి, వేగవంతమైన విచారణ జరపవలసిన భాధ్యత ఎంతైనా ఉన్నది. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాంపులు, లిఫ్టులు, సౌకర్యవంతమైన మరుగుదొడ్ల లేమి, విద్యాసంస్థల్లో సమగ్ర విద్య అమలులో లోపం, ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాల కొరత, పెన్షన్ల మంజూరులో ఆలస్యం, వైద్య పరికరాలు, సహాయక ఉపకరణాల కొరత, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, దివ్యాంగ మహిళలపై ద్విగుణ వివక్ష

**ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు**

ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేక దివ్యాంగ హక్కుల పరిరక్షణ సెల్ ఏర్పాటు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరి సౌకర్యాలపై కఠిన పర్యవేక్షణ, ఫిర్యాదులపై 30 రోజుల్లో పరిష్కారం విధానం, భూమి ఆక్రమణ కేసుల్లో వేగవంతమైన న్యాయ ప్రక్రియప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ అమలు పర్యవేక్షణ. పోలీసు, రెవిన్యూ, న్యాయ వ్యవస్థ అధికారులకు ప్రత్యేక శిక్షణ. వడ్డీ రహిత రుణాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబన. చట్టాలు ఉండటం గర్వకారణమే కానీ అవి బాధితుల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. దివ్యాంగులను సహాయం కోరే వ్యక్తులుగా కాకుండా హక్కులు డిమాండ్ చేసే పౌరులుగా గుర్తించినప్పుడే నిజమైన సమానత్వం సాకారం అవుతుందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి – టిఆర్విఎస్ స్పష్టం చేస్తుంది. “దివ్యాంగులపై వివక్ష చూపే ప్రతి వ్యక్తి శిక్షకు గురయ్యే రోజు వచ్చినప్పుడే సమానత్వం నిజంగా అమలు అవుతుంది,”

## ప్యూర్ వెజిటేరియన్. ఋషుల బండారం ప్రారంభం..

హైదరాబాద్ బ్యూరో /ఫిబ్రవరి 26(జనసంఘర్షణ )



యువత ఉపాధి పొందుతూ మరికొంతమందికి ఉపాధి అందించే లక్ష్యంగా ముందుకు సాగాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్యే మూటా గోపాల్ అన్నారు. అశోక్ నగర్లో ఏర్పాటు చేసిన రుచుల బండారం హోటల్‌ని గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్యే ముటా గోపాల్ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుచితో పాటు నాణ్యత పరిశుభ్రత పాటించడం ద్వారా భోజన ముతోపాటు ఉపాధి పొందుతూ మరికొంతమందికి ఉపాధి అందించే విధంగాఉన్నారని నిర్వాహకులని అభినందించారు. నిర్వాహకులు కిరణ్, సిమ్రాన్ జయంత్, బిఆర్ఎస్ మూట నరేష్, బీజేపీ నాయకులు భరత్ గౌడ్, టిఆర్ఎస్ మీడియా ఇన్చార్జ్ ఉచ్చ పూర్తి ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్, ముదిరాజ్, నవీన్ కుమార్, జిఎస్టి రాజు తదితరులు పాల్గొన్నారు. భోజన ప్రియులు ఆదరిస్తారని అన్నారు. ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొన్నారు.

# ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

భద్రాద్రి కొత్తగూడెం.ఇల్లెందు ప్రతినిధి ఫిబ్రవరి 26( జన సంఘర్షణ )

ఇల్లందు పట్టణంలోని ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. గురువారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో సభ్యుల సమక్షంలో నూతన అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గడ్డం వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా బండి రామారావు (ఐ న్యూస్) ఎంపికయ్యారు. సభ్యుల ఏకగ్రీవ మద్దతుతో వారు ఎన్నిక కావడం విశేషం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు మరియు కార్యదర్శికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, సభ్యుల ఐక్యతతో పత్రికారంగ గౌరవాన్ని మరింత పెంపొందిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి బండి రామారావు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగం వేణుగోపాల్, గుడివాడ శ్రీనివాస్, దుద్దుకూరి సుమంత్, మాదాసు నర్సి, కనోజుల రాజు, ఎల్. శ్రీనివాస్, దేవిరెడ్డి సువర్ణపాక శోభన్ బాబు, తంగల్లపల్లి శ్రీనివాస్ చారి, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సభ్యుల ఒదరూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రెస్ క్లబ్ కార్యకలాపాలు మరింత చురుకుగా సాగాలని ఆకాంక్షించారు. ఇల్లందు ప్రాంతంలో పత్రికారంగానికి విశిష్ట గుర్తింపు తీసుకురావడంలో ఈ నూతన కమిటీ కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.




# బహుజనులంతా ఏకం కావాలి..రాజ్యాధికారం సాధించుకోవాలి

◆ బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరీ రామచందర్ యాదవ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 26, ( జన సంఘర్షణ ):




అంబర్పేట్ మహారాణ ప్రతాప్ మినీ హాల్లో అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన అఖిల భారత బహుజన సేన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం హాజరైనారు. అఖిలభారత బహుజన సేన కార్యకర్తల నాయకుల ముచ్చట్ల అభిప్రాయాల సమావేశం మహారాణా ప్రతాపాల్లో జరిగింది మొదటగా తొలి పరిచయం అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ కార్యకర్తలు బహుజన బిడ్డల గురించి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటిన కూడా బహుజనులైన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సోదరులు సోదరీమణులు పేదరికంలో మగ్గి ఇప్పుడున్న పార్టీల జెండాలు మోసి జిందాబాద్ల కొట్టి బానిసలుగా బ్రతుకుతున్నాం. పోరాట పటిమతో ఎక్కడ బహుజనులకు అన్యాయం జరిగిన జెండా ఎత్తి పిడికిలి బిగించి పోరాటం చేసి ప్రభుత్వం లో ఉన్న ఈ అవినీతిపరులను అన్యాయం చేసే వాళ్ళను మెడలు వంచి న్యాయం వచ్చేవరకు పోరాడుదామని అంతిమంగా అధికారమే లక్ష్యమని అందులో మనం అందరూ పోరాట యోధులుగా మహనీయులను ఆదర్శంగా తీసుకొని మహాత్మ జ్యోతిరావు పూలే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పెరియార్ రామస్వామి శివాజీ మహారాజ్ ఇలాంటి పెద్దల ఆశీర్వాదంతో ముందుకెళ్లి అధికారం సాధిద్దామని పేదరికం నిర్మూలించడానికి అదేవిధంగా బహుజనులకు రాజ్యాధికారం సాధించి దేశాభివృద్ధిలో కూడా మనం ముందుకు వెళ్దామని మీ అందరూ సహకరించాలని పిలుపునివ్వడం జరిగింది. దేరీ రామచంద్ర యాదవ్ సమావేశానికి విచ్చేసిన బహుజన బిడ్డలనుదేశించి ప్రసంగిస్తూ అడుక్కుంటే అధికారం రాదు అధికారమే మాస్టర్ కి అన్ని సమస్యలను దూరం చేయటానికి కేవలం అధికారమే అవసరం అధికారమే అంతిమ లక్ష్యంగా పోరాటం చేద్దాం. ఒకరికొకరు చేతులు కలిపి అంబర్పేట్ శీనన్నను బలోపేతం చేసి ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దామని 28,29లో జరిగే ఎన్నికల్లో అసెంబ్లీ పార్లమెంటులో కూడా మన జెండా ఎగరవేద్దామని కోరుకోవడం జరిగింది జెండా ఆవిష్కరణతో పాటు సిద్ధాంత పరంగా ఎజెండా తయారు చేసుకొని ఈ రెండు మూడు సంవత్సరాల్లో ఇప్పుడున్న భోజనం సేన తో పాటు పార్టీని కూడా డిక్లేర్ చేసుకుని పోరాటం చేద్దామని బహుజనుల రాజ్యము భోజనలకు న్యాయం బహుజనులకు అధికారం అనే నినాదంతో ముందుకు వెళ్దామని పేర్కొనడం జరిగింది. బీసీలందరూ మన ఓట్లు మనం వేసుకోవాలి. మన వాళ్ళని గెలిపించుకోవాలి. కేవలం ఇప్పుడు అధికారంలో ఉన్న వాళ్ళు 8- 9% ఉన్నవాళ్లే మనల్ని మేల్కోవడం మనం బానిసలుగా పని చేయడం. పల్లకి మూత మానేయాలని అదేవిధంగా వాళ్లకు జై కొట్టుడు కూడా మానేయాలని వీరి రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా అధికారం కోసం పని చేద్దామని అనేక మంది పెద్దలు మహిళలు యువత అందరూ ఏకమై పోరాడుదాం. అని జై బహుజన్ జై బీసీ జై ఎస్సీ ఎస్టీ భోజనాల ఐక్యత వర్ధిల్లాలని పేర్కొంటూ కార్యక్రమం మహా గొప్పగా ఘనంగా సమావేశం ముగించడం జరిగింది. రెండవ మీటింగ్ కు అందరికి భారీ ఎత్తున మనం ఈ వర్క్ షాప్ కూడా తయారు చేసుకుని అందరు కలిసి మరొక సమావేశం ఏర్పాటు చేద్దామని డిక్లేర్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ తో పాటు దేరి రామచంద్ర యాదవ్ తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ ఈసీ ఫెడరేషన్ అధ్యక్షులు కుమార్ యాదవ్ యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్ పెల్లి శ్రీనివాస్ మహిళలు యువత పెద్దలు పాల్గొన్నారు.అనేక మంది బహుజనులు పెద్దలు 33 జిల్లాల నుండి అదేవిధంగా హైదరాబాద్ పట్టణం నుంచి భారీగా హాజరై ఈ సమావేశం విజయవంతంగా ముగించడం జరిగింది.

# గ్రామంలో సోదరా భావంతో మెలగాలి

◆ మత ద్వేషాలను రెచ్చగొట్టి వారిపై అప్రమత్తంగా ఉండండి.
◆ శాంతి సమావేశంలో రుద్రూర్ ఇందూర్ శేఖర్ సతీమణి సర్పంచ్ సునీత

రుద్రూర్: ఫిబ్రవరి.26( జన సంఘర్షణ




ప్రశాంతంగా కొనసాగుతున్న గ్రామాలలో ఇలాంటి మత ద్వేషాలు, సోషల్ మీడియాలో అని ఇచ్చిన వ్యాఖ్యలు పెట్టి ప్రశాంతతకు భంగం కలిగించకూడదని నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామ సర్పంచ్ సునీత గ్రామస్తులకు సూచించారు. ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో గ్రామ సర్పంచ్ సునీత గ్రామంలో శాంతి సమావేశం నిర్వహించారు. మతాలకు అతీతంగా అందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, ఆ తర్వాత అందరూ ఒకటే, గ్రామం అంటే అందరూ కలిసి ఉండటమే అదే గ్రామం అంటూ ఆమె సూచించారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా గ్రామాలలో ప్రశాంతతకు భంగం కలిగించడానికి కుట్రలు చేస్తారని వారి కుట్రలో పడి ముఖ్యంగా యువత తమ నిండు జీవితాలను నాశనం చేసుకోకూడదని సునీత సూచించారు. రుద్రూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో గాంధీ చౌక్ శాంతి సమావేశం నిర్వహించారు. సర్పంచ్ సునీత చంద్రశేఖర్ ఉపసర్పంచ్ నిసార్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో గడపాలని ఆమె సూచించారు. మత ద్వేషాలకు రెచ్చగొట్టే వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సునీత సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ సునీత చంద్రశేఖర్, నిసార్, ఇందూర్ చంద్రశేఖర్, పత్తి రాము, డౌర్ సాయిలు, పట్టుకరి శివ, డి. సతీష్ గౌడ్, విట్టల్ గౌడ్ శంకర్ పటేల్, కాలేసాబ్, జహీర్, సుభాని మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి అకాడమిక్ బృందం సమగ్ర పరిశీలన

బోధన్: ఫిబ్రవరి 26జన సంఘర్షణ



బోధన్ మండలంలోని ఆజాం గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రోజు జిల్లా స్థాయి అకాడమిక్ బృందం సమగ్ర పరిశీలన నిర్వహించినట్లు మండల విద్యాధికారి నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రత్నాకర్ నేతృత్వంలో అకాడమిక్ బృందం పాఠశాలను సందర్శించి విద్యా, పరిపాలనా అంశాలపై సవివరంగా పరిశీలన చేపట్టింది. పరిశీలించిన ప్రధాన అంశాలు. ఉపాధ్యాయుల బోధన విధానాలు, తరగతి గది నిర్వహణ, టీచింగ్ డైరీలు, పాఠ్య ప్రణాళిక. విద్యార్థుల నోటు పుస్తకాల పరిశీలన. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులు. బేస్‌లైన్, మిడ్లైన్, ఎఫ్.ఏ-1, ఎఫ్.ఏ-2, ఎఫ్.ఏ-3, ఎస్.ఏ-1 పరీక్షల వివరాలు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన సమగ్ర రికార్డులు. ఈ పరిశీలన తీరును జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పరిశీలించి ఉపాధ్యాయులతో అకాడమిక్ బృంద సభ్యులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. విద్యా ప్రమాణాల పెంపు, ఫలితాల మెరుగుదల, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి, సమయపాలనతో బోధన నిర్వహణ వంటి అంశాలపై తగిన సూచనలు, సలహాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ బృంద సభ్యులు అజయ్ , బసవంత రావు, సాయిలు, రామారావు సాయిబాబా, శ్రీనివాస్, ఉపాధ్యాయులు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. విద్యా నాణ్యతను మరింత అభివృద్ధి చేయడంలో ఇటువంటి అకాడమిక్ పరిశీలనలు ఉపయోగకరంగా ఉంటాయని జిల్లా విద్యాధికారి అశోక్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన తెలిపారు.

## నియోజకవర్గంలో అభివృద్ధి పథంలో గ్రామాలు..

పెద్ద కొడప్గల్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)



మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతు న్నాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.
నిజాంసాగర్: పెద్ద కొడంగల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని జూకల్లె తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. అనంతరం విట్టల్వాడి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూకల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలి అన్నది మా లక్ష్యం అని అన్నారు. గ్రామపం చాయతీ భవనాల ప్రజలకు పరిపాలన సేవలు సులభంగా అందించే ఒదుకు కీలక పాత్ర పోషిస్తాయి. అదేవిధంగా విటల్ వాడే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడి గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని అని తెలిపారు .తాగునీరు విద్యుత్ పారిశుద్ధ్యం వంటి అం శాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని అన్నారు ప్రజల సహకారంతోనే ఈ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజల ఆశీస్సులతో ఇంకా మరిన్ని అభివృద్ధి కార్యక్ర`మాలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సారధ్యంలో జూకల్ నియోజక వర్గంలోని గ్రామాల్లో కనబడుతున్న మార్పు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలు అభివృ ద్ధిని ఏమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో చెరువులో దూకి ఉపాధ్యాయుడు మృతి..

మద్నూర్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)



అప్పుల భారాన్ని తట్టుకోలేక ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెరువుల దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో విషాదం నింపింది. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బిచ్కుంద మండలం కేంద్రానికి చెందిన గోని పీరయ్య ( 41) గత కొన్ని రోజులుగా అప్పుల బాధతో మానసిక ఆందోళనకు గురయ్యాడు. మృతుడి భార్య సుప్రియ తెలిపిన ప్రకారం కుటుంబ సభ్యులతో కలిసి మద్దూరు మండలం పెద్ద శంకర్ గ్రామంలో తల్లి గారి ఇంట్లో ఉంటు న్నానని బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి రాలేదని తెలిపారు. ప్రధానంతరం పెద్ద శంకర్గా గ్రామ చెరువులో ఆయన మృతదేహం కనిపించినట్లు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుని కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కోదండరామ స్వామి ఆలయంలో పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం

హైదరాబాద్, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 26,( జన సంఘర్షణ ):



కూకట్ పల్లి నియోజకవర్గం, జగద్గిరిగుట్టలోని వెంకటేశ్వర నగర్‌లో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయ స్వామి సమేత కోదండరామ స్వామి ఆలయంలో నూతన శిలామయ ఆలయ యంత్ర మూలవిరాట్, గోదాదేవి, వాయు లింగ గణపతి, గరుడ విగ్రహం, నవగ్రహాలు, శిలా ధ్వజస్తంభం, పరివార దేవతాది,విమానశిఖర కలశ పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించిన పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరైనారు.ఈ సందర్భంగా స్వామివార్ల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని దివ్య దర్శనం చేసుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు రాజేశ్వర రావుని ఘనంగా సన్మానించి, వేదాశీర్వచనాలతో ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కేంద్రబిందువులని, భక్తి భావనతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొం దించాలని అన్నారు. ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర నగర్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం

హైదరాబాద్,కుత్బుల్లాపూర్ ప్రతినిధి అంజిబాబు,ఫిబ్రవరి 26,( జన సంఘర్షణ ):



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని ప్రకాశం పంతులు నగర్ హనుమాన్ దేవాలయంలో శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్చార్జ్ కోలాన్ హనుమంత్ రెడ్డితోపాటు బిజెపి నాయకులు గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరైనారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమ ంలో కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకోండి



**భద్రాద్రి కొత్తగూడెం. ఇల్లెందు ప్రతినిధి ఫిబ్రవరి 26(జన సంఘర్షణ )**
ఖమ్మం వెలుగుమట్ల లో భుదాన్ భూమిలో దశబ్దకాలంగా పట్టాలు పొంది స్థిర నివాసం ఉంటున్న నిరుపేదలను అత్యంత కర్కశంగా వేలమంది పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం, బుల్డోజర్ లతో వారి గుడిసెలను కూలగొట్టారు. నిరాశ్రయులైన కుటుంబాలను పరామర్శించడానికి భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహాక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు వెలుగుమట్లకు వస్తున్న సందర్భంగా దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఖమ్మం బయలుదేరిన టిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## పోతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ జడ్పిహెచ్ఎస్ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి మున్ని నాయక్, మండల అధికారి ఎంపీడీవో చందర్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు



**పోతంగల్: ఫిబ్రవరి.26( జన సంఘర్షణ)**
నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ జడ్పిహెచ్ఎస్ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి మున్ని నాయక్, మండల అధికారి ఎంపీడీవో చందర్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలను సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నికి సంబంధించిన బియ్యం ఇతర వస్తువులు పరిశీలించారు. బియ్యంలో వ్యర్థాలను చూసి అసంతృప్తి వ్యక్తం చేసింద్రు. మధ్యాహ్న భోజనం వండే సమయంలో శుభ్రంగా చేసి భోజనం తయారు చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని వినియోగంలో లేని టాయిలెట్లను శుభ్రం చేయించి వాడుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పాలిసెట్- 2026లి నోటిఫికేషన్ విడుదల




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించబడే పాలిసెట్ – 2026 నోటిఫికేషన్ విడుదలైనట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి సుధాకర్ తెలిపారు. రాష్ట్టంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆన్లైన్ దరఖాస్తులు 2 ఫిబ్రవరి 2026 నుంచి ప్రారంభమై 20 ఏప్రిల్ 2026 వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోటగిరి కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ మరియు డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ అనే కోర్సులు నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అనే నూతన కోర్స్ ప్రారంభించబడినట్లు తెలిపారు. పాలిసెట్ – 2026 దరఖాస్తులు నింపడం, ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు సహాయం అందించేందుకు కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు కళాశాలకు ప్రత్యక్షంగా వచ్చి మార్గదర్శనం పొందవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు 9948264254, 8332919395 మరియు 9491361663 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

## జెఎన్‌జె జర్నలిస్టుల స్థలాలకు “వే అవుట్”కు సర్కారు కసరత్తు

**రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**హైదరాబాద్ ప్రతినిధి అంజిబాబు, ఫిబ్రవరి 26, ( జన సంఘర్షణ ):** రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రు జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల అంశంపై చిక్కులు లేకుండా ఒక “వే అవుట్” కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రోజు సచివాలయం తన చాంబర్‌లో మంత్రులు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశం అనంతరం జర్నలిస్టుల అంశంపై మంత్రి పొంగులేటి స్పందించారు. జెఎన్‌జె జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం చూపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికీ జేఎన్జే సొసైటీ జర్నలిస్టుల పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. జర్నలిస్టుల బాధలు తెలుసునని మంత్రి అన్నారు. పేదలకు కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్‌గా ఉందని, ఖమ్మం జిల్లా వెలుగుమెట్లలో పేదల ఇండ్లు కూల్చిన అంశంపై అర్హులైన పేదలకు ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇళు కట్టి ఇస్తుందన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్ల దొంగల అంతరాష్ట్ర ముఠా అరెస్ట్..



**మద్నూర్: ఫిబ్రవరి 26 (జనసంఘర్షణ)**
మద్నూర్. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 50 కి పైగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ను వంశం చేసి కాపర్ కాల్స్ ని అపారిస్తున్న అంతరాష్ట్ర ముఠాను మద్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డిఎస్పి విట్టల్ రెడ్డి పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్. మద్నూర్ ఎస్సై మోహన్ రెడ్డి ప్రత్యేక బృందాలు ఈ ముఠాను పట్టుకున్నాయి అంతరాష్ట్ర దొంగలు ముఠాను మీడియా ముందు ప్రవేశపెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 8న పెద్ద ఏ క్లారా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసం పై జిపిఓ మన్నే సంతోష్ ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభమైందన్నారు. విచారణలో జూకాలుకు చెందిన సుభాష్ కరీమ్ లు పగటిపుట రెక్కి నిర్వహించి మహారాష్ట్రకు చెందిన అర్జున్ సురేఖ సునీల్ వంటి దొంగలకు సమాచారం ఇచ్చేవారు. వీరంతా గతంలో నిజామాబాద్ జైల్లో పరిచయమై ముఠాగా ఏర్పడ్డారు. నిందితులు ఔరంగాబాద్ నుండి మారణయుద్ధాలు. వాహనాలతో వచ్చి మద్నూర్. జుక్కల్. బిచ్కుంద. పిట్లం ప్రాంతాలలో అర్ధరాత్రి వేళల్లో ట్రాన్స్ఫార్మర్లను పగలగొట్టి కాపర్ కాల్స్ ను ఎత్తుకెళ్లేవారు. దీనివల్ల రైతులకు తీవ్ర విద్యుత్ అంతరాయం కలిగి నష్టం వాటిల్లింది. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు నగదు 30,000, బంగారం 1తులం, వాహనాలు 2కార్లు, 1 తుఫాన్ వాహనం, 3 బైకులు. 2 కత్తులు, కాపర్ కాయలు బెండర్ స్వాధీనం చేసుకొని నేరస్తులను రిమాండ్ కు తరలించిన పోలీసులు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు

## నల్గొండలో రోడ్ల పనులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష

**ఇందిరాభవన్ ఆర్‌డబీ అధికారులతో భేటీ**



నల్లగొండ. ఫిబ్రవరి .26 ( జనసంఘర్షణ )
బుద్ధారం, అప్పాజిపేట, బ్రాహ్మణవెల్లంల రహదారులు రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశం...సోమనవాగు పగిడిమర్రి వంతెన మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్య నిర్దేశం...కనగల్ జంక్షన్-కనగల్ నాలుగు లేన్ల రహదారి పనులు తక్షణమే ప్రారంభించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు...కనగల్ -తిమ్మన్నగూడెం రహదారి పనులు వేగవంతం చేయాలని స్పష్టం మామిడాల సీసీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలన్న మంత్రినార్కెట్‌పల్లి-మంద్ర రహదారి పనులు ఆలస్యం చేస్తే కఠిన చర్యలు
వైటీపీఎస్ రహదారి పురోగతిపై ప్రత్యేక సమీక్ష గడువులో పనులు పూర్తి కాకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిక
రోడ్లు భావనాల శాఖ సినిమాటోగ్రఫీ- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

# మాణిక్ ప్రభు హై స్కూల్లో జర్నలిస్ట్ ప్రవీణ్ కుమార్ దంపతుల సన్మానం

**ప్రజా వారధి జనసంఘర్షణ**




జహీరాబాద్ స్థానిక మాణిక్ ప్రభు హై స్కూల్ పాఠశాలలో గురువారం జర్నలిస్ట్ ప్రవీణ్ కుమార్ దంపతులు ఘనంగా సన్మానించబడ్డారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి నిజాయితీగల జర్నలిస్టులను సన్మానించడం సమాజ సేవకు సహాయపడుతుందని అన్నారు. అంతేకాక, విద్యార్థులకు నిజాయితీ, సమగ్ర సమాచారం, సాంఘిక బాధ్యతలకు పాఠం ఇవ్వడం అత్యంత అవసరమని, పాఠశాలలు మాత్రమే కాక, సమాజంలోని నైపుణ్యపూర్ణ వ్యక్తుల స్ఫూర్తి కూడా విద్యార్థులకు ప్రేరణ అని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రవీణ్ కుమార్ దంపతులను అభినందించారు.

## విద్యతో పాటు సంస్కారం నేర్పించడమే తమ లక్ష్యం

### -ప్రిన్సిపాల్ వెంకటయ్య

**ప్రజా వారధి జనసంఘర్షణ**



నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ పాఠశాల కొనసాగుతుందని స్థానిక శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మరెల్లి వెంకటయ్య వ్యాఖ్యనించారు. పాఠశాలలో గురువారం నాడు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత మైన లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ క్రమంలోనే విద్యార్థులు ముందడుగు వేయాలని సూచించారు. చదువు జ్ఞానాన్ని నేర్పిస్తే సంస్కారం ఆదర్శమైన జీవితానికి నడక నేర్పిస్తుందని ఉద్బోధించారు. ఈ స్వయంపాలన దినోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం. వైష్ణవి, మండల విద్యాధికారిగా డి. పూజ, ప్రిన్సిపాల్ గా ఎస్. తుల్జారాం, మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తించారు. అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మాణిక్య మ్మ,నాగలక్ష్మి, శివశంకర్, నర్సింలు, అరుణ, స్వరూప, మందాకిని, అనిత, సువర్ణ, సోని, లక్ష్మి, రాజేశ్వరి లు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగిన ఈ స్వయం పాలన దినోత్సవంలో పోషకులు సైతం తమ చిన్నారులను హోదాకు తగ్గట్టుగా వేషధారణ చేసి పంపడం ఆహుతులను ఆకట్టుకొంది.

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెలుగుమట్ల బాధితులకు పరామర్శ

**ఖమ్మం జనసంఘర్షణ :**



ఖమ్మం అర్బన్ మండలం వెలు గుమట్లలో గూడు కోల్పోయిన బాధి తులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్ పరామర్శిం చారు. వెలుగు మట్ల భూదాన్ భూము ల్లో సుమారు 800 కుటుంబాలకు చెందిన బడుగు వర్గాల వారు కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం గడుపుతున్నారు. అధికార పక్షానికి చెందిన ప్రముఖుల ప్రోద్భలంతో పోలీసుల సమక్షంలో మంగళవారం ఉదయం పేదల గుడిసెలు నేలమ ట్టం కావడం తెలిసిందే. ఈ దృష్ట్యా బీఆర్ఎస్ కార్య నిర్వహక అధ్యక్షులు కేటీఆర్ గురు వారం మధ్యాహ్నం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, తదితర ప్రముఖులతో కలిసి వెలుగుమట్లకు వచ్చి నేలమట్టమైన గుడిసెలను పరిశీలించారు. కేటీఆర్ తదితర ప్రముఖులు బాధితులతో కలిసి నేలపై కూర్చుని తమ సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత సీక్వెల్ సమీపాన అంబేద్కర్ భవనంలో నిర్వాసితుల శిబిరాన్ని కేటీఆర్ తదితర నాయకులు సందర్శించి బీఆర్ఎస్ కొండంత అండగా ఉంటుందని భరోసానిచ్చారు, ఈ సందర్భంగా బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ అధ్యక్షుడు రేగా కాంతారావు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, చంద్రావతి, నాయకులు దిండిగాల రాజేందర్,ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల బాధితులకు భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ వద్దిరాజు

**ఖమ్మం జనసంఘర్షణ**

ఖమ్మం నగర శివారు వెలుగు మట్లలోని భూదాన్ బోర్డ్ భూమిలో ప్రభుత్వం తొలగించిన గుడిసెలు, నిరాశ్రాయులైన బాధితుల పరామర్శ కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఖమ్మం పర్యటనకు విచ్చేశారు. యువనేత కేటీఆర్ కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు.. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వెలుగుమట్ల లో నిరాశ్రయులైన బాధితులు తమ గుడిసెల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేటీఆర్ పర్యటన లో స్వల్ప ఆలస్యం అవ్వడంతో బాధితులంతా ఆకలి, దప్పికతో అలమటిస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అప్పటికప్పుడు సుమారు 600 మంది బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు భోజనాలు లేక అలమటిస్తున్న తరుణంలో ఘటనా స్థలిలో భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ రవిచంద్రకు ఋణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమర వీరుడు సిరిసిగ లక్ష్మణ్ యాదవ్ 16వ వర్ధంతి ఘన నివాళులు

**ప్రజా వారధి జనసంఘర్షణ**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గము, జహీరాబాద్ మండలం, హోతి (బి) గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జహీరాబాద్ తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ అమర వీరుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన జహీరాబాద్ ముద్దుబిడ్డ సిరిసిగ లక్ష్మణ్ యాదవ్ 16వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్. పెద్దగొల్ల నారాయణ హాజరై అమర వీరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధన కోసం సామాజిక న్యాయం దిశగా నిరంతరం పోరాటం



కొనసాగిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల హక్కుల పరిరక్షణలో ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. రెండు సార్లు ప్రభుత్వాలు మారినప్పటికీ అమర వీరులు సిరిసిగ లక్ష్మణ్ యాదవ్ , మరియు న్యాలకల్ మండలం బసంత్పూర్ గ్రామానికి చెందిన ఈశాన్ రెడ్డి ల స్ఫూర్తి విగ్రహాలు ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగం చేసిన అమరుల సేవలను స్మరించుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం ఏ ప్రభుత్వం అధికారం లో ఉన్న అమరుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కొండపురం నర్సిములు అన్నారు. హోతి (బి) గ్రామంలో సిరిసిగ లక్ష్మణ్ యాదవ్ విగ్రహం, అలాగే బసంత్పూర్ గ్రామంలో ఈశాన్ రెడ్డి ల విగ్రహం ఏర్పాటు చేసి, ప్రభుత్వం అధికారికంగా గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు కొండపురం నర్సింలు ,ప్రధాన కార్యదర్శి శంకర్ సాగర్, విశ్వనాథ్ యాదవ్,మదినం శివ ప్రసాద్, వడ్డే శేఖర్, బీసీ మైనారిటీ లీడర్ మొహమ్మద్ ఇమ్రాన్, చెన్న బసవ, సంగారెడ్డి , బాలకృష్ణ, దశరథ్ ప్యార్లా, రాజ్ తుముకుంట, రాజీవ్ కుమార్, విజయ్ కుమార్, గొల్ల నర్సింలు ,తదితరులు పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

# శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు పాల్గొన్న -ఎమ్మెల్యే జారే

### సంత్ సేవాలాల్ ఆదర్శప్రాయుడు

**అన్నపురెడ్డిపల్లి జనసంఘర్షణ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి, భోగ్ బండార్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జారేఆదినారాయణ హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన బంజారా మహోత్సవంలో బంజారాలు భారీగా పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా బంజారా సోదర సోదరీమణులతో కలిసి ఎమ్మెల్యే సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ... సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శి అని అన్నారు. ఆయన బోధనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, సమాజంలో ఐక్యతా భావం, నైతిక విలువల పెంపుకు ఆయన చూపిన మార్గం శాశ్వతమని అన్నారు. బంజారా సోదరులు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి మౌలిక సదుపాయాల కల్పన, విద్యా–ఉపాధి అవకాశాల విస్తరణ కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బంజారా మహోత్సవాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సమాజం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



అనంతరం పలువురు బంజారా ప్రముఖులు మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ ఐక్యతతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. బంజారా యువత విద్య, ఉపాధి రంగాల్లో ముందంజ వేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లంబాడీల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం, క్షేత్రధర్మాన్ని రక్షించడం బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ ,దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేసి మూఢనమ్మకాలు, హింస, మద్యపానం మొదలైన వ్యసనాలకు బానిస కాకుండా స్వచ్ఛమైన జీవనం కొనసాగేలా బంజారాలకు హితోపదేశం చేస్తూ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అన్నపురెడ్డిపల్లి డిప్యూటీ తహసీల్దార్ జగధీశ్వరి,దమ్మపేట తహసీల్దార్ కొప్పుల రాంనరేశ్ , అర్.ఐ వేంకటేశ్వరరావు ,జీపీఓ రెడ్డిమాళ్ళ శ్రీను,ఎంపీడీఓ మహాలక్ష్మి,ఎస్.ఐ విజయ్ సింహారెడ్డి ,సర్పంచ్ లకావత్ లక్ష్మి,ఉప సర్పంచ్ మారగాని అశోక్ శివాలయ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు ,మల్లెల నర్సింహారావు ,అటెండర్ పగిల్లపల్లి ఉపేందర్,బంజారాల నాయకులు,కార్యకర్తలు

# 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు త్వరితగతిన అందాలి

### -ఫోన్ రాగానే స్పందించి ప్రాణాలను కాపాడాలి:జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్

**వేలేరు జనసంఘర్షణ :**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్స్ సేవలకు ఫోన్ చేసిన వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలని జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్ సూచించారు. గురువారం వేలేరు మండలంలోని 108 అంబులెన్స్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సేవల నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా అంబులెన్స్లో అందుబాటులో ఉన్న అత్యవసర మందులు, వైద్య పరికరాలు, రిజిస్టర్లు మరియు సాంకేతిక పరికరాల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క నిమిషం ఆలస్యం కూడా ప్రాణ నష్టానికి దారి తీసే అవకాశం ఉన్నందున ప్రతి కాల్కు వేగంగా స్పందించి బాధితులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎండాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.


విలేకరులు కావలేను



తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థా
పనిచేయుటకు అసాక్తి, ఉత్సహం కలి
యువకులు కావలేను. సీనియర్‌లకు ప్రధాన్యత ఇవ్వబడును



వివరాలకు సంప్రదించండి 63050 26524


Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co